క్లుప్తంగా

## 27, 28 తేదీల్లో పేర్నమిట్టలో గడపగడపకు మన ప్రభుత్వం



నూతన వలంటీర్‌కు నియామకపత్రం అందిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: ఒంగోలు 42వ డివిజన్‌లోని పేర్నమిట్ట శాంతినగర్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి తెలిపారు. శనివారం 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావుతో పాటు పార్టీ స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమాన్ని జయప్రదం చేయడంపై చెంచిరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించబడిన వలంటీర్‌కు నియామకపత్రాన్ని చెంచిరెడ్డి చేతుల మీదుగా అందించారు.

## కరవదిలో నేడు విద్యుత్ అంతరాయం

ఒంగోలు రూరల్: సాధారణ మరమ్మతుల్లో భాగంగా కరవది క్రిస్టియన్‌పేట, ఒంగోలు వెళ్లే మార్గంలోని ఇటుక బట్టీలు, వలేటివారిపాలెం వరకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఒంగోలు రూరల్ ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## ఘనంగా చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి



మాట్లాడుతున్న సుబ్బారావు

ఒంగోలు: గానగంధర్వుడు.. చీమకుర్తి నాగేశ్వరరావు అని రాష్ట్ర పౌరాణిక కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు డీవీ సుబ్బారావు కొనియాడారు. స్థానిక నెల్లూరు బస్టాండులో శనివారం నిర్వహించిన నాగేశ్వరరావు 17వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అనేకమంది సీనియర్ కళాకారులను ఏకం చేసిన మహానటుడు చీమకుర్తి నాగేశ్వరరావు అని పేర్కొన్నారు. కళాకారుల అభ్యున్నతికి సమిష్టిగా పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, కళాకారుడు ఎం.శాంతారావు, సీనియర్ కళాకారులు వెంకటేశ్వర్లు, అంగలకుర్తి ప్రసాద్, జయారపు సూర్యనారాయణ, జయరావు, మాకా ఆంజనేయులు, రత్తయ్య, నాగార్జున తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

**చీమకుర్తిలో...**

చీమకుర్తి: సత్యహరిశ్చంద్రుడుగా పేరుగాంచిన చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శనివారం చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బీ జవహర్, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన, తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని పలు జిల్లాల్లో సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్ర పాత్రలో ప్రేక్షకులను మెప్పించి విశేష ఆదరణ పొందిన మంచి కళాకారుడు నాగేశ్వరరావు అని కొనియాడారు.

## ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ

అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి పదివేల అరటి పండ్లతో (దశసహస్ర కదళీఫలార్చన) పూజా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారి అభిషేకం అనంతరం వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు, భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి ధ్వజస్తంభానికి నారికేళసమర్పణ చేశారు.



కోనేరులో తెప్పోత్సవం



పాల్గొన్న భక్తులు

# వైభవంగా తెప్పోత్సవం

మదనూరు (కొత్తపట్నం): తెప్పోత్సవాన్ని మదనూరు గ్రామంలో శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో రమణారెడ్డి ఆధ్వర్యంలో కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామి వార్లను ఈతముక్కల గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మదనూరు రామలింగస్వామి ఆలయానికి తీసుకొచ్చి ఎదురుగా ఉన్న కోనేరు ఒడ్డున ఉంచారు. కోనేరులో సిద్ధం చేసిన తెప్పలోకి రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామిలను చేర్చి పూజలు చేశారు. తమలపాకులపై కర్పూరం వెలిగించి కోనేరులో వదిలారు. స్వామివార్లకు తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు కోనేరు చుట్టూ తిరిగి తిలకించారు. అనంతరం కన్నేశ్వరస్వామి, కోదండరామస్వామికి ఈతముక్కలలో గ్రామోత్సవం నిర్వహించారు. మదనూరులో రామలింగేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ఆనవాయితీ ప్రకారం బ్రహ్మోత్సవాల ముందు వచ్చే అమావాస్య రోజున తెప్పోత్సవం జరిపినట్లు తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తామని చెప్పారు.

## మూల్యాంకనాన్ని వేగవంతం చేయాలి

● హెచ్ఎంలతో డీఈవో విజయభాస్కర్

ఒంగోలు: సమ్మేటివ్-1 పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని వేగవంతం చేయాలని డీఈవో బి.విజయభాస్కర్ హెచ్ఎంలను ఆదేశించారు. ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం ఒంగోలు మండలంలోని ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనం చేసేటప్పుడు విద్యార్థులు ఏయే అంశాల్లో పొరబాట్లు చేస్తున్నారనేది గుర్తుంచుకుని మూల్యాంకనం వివరాలను ఆదివారం సాయంత్రంలోగా పాఠశాల వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. జవాబు పత్రాలను ఉపాధ్యాయులు మాత్రమే మూల్యాంకనం చేసే విధంగా చూడాలన్నారు. ఇతర వ్యక్తులు మూల్యాంకనం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల దైనందిన కార్యక్రమాలలో భాగంగా పిల్లల నోట్ బుక్స్ కరెక్షన్ చేయడం, వర్క్‌బుక్‌లను పరిశీలించడం, సిలబస్‌ను నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టడం చేయాలన్నారు. ఉపాధ్యాయులందరూ విధిగా లెసన్ ప్లాన్‌ను టీచర్ డైరీలను వారి స్వహస్తాలతో రాశారో లేదో ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి యూనిఫాంలో స్కూల్‌కు వచ్చే విధంగా విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలన్నారు. కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్‌లో రెగ్యులర్‌గా రిలీజైన టికెట్లను అనుమతించిన సమయంలోగా క్లోజ్ చేయాలన్నారు. నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కాంపోనెంట్ వారీగా ఫొటోలను ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా అప్‌లోడ్ చేయించాలని, ఒక పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో ప్రోగ్రెస్‌ని కేవలం ఫొటోలు మాత్రమే స్పష్టం చేస్తాయని అన్నారు. తప్పనిసరిగా ఫొటోలు అప్‌లోడ్ చేయడంతో పాటు ప్రతి శుక్రవారం ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవో సూచించారు.

## సచివాలయ కన్వీనర్లకు అభినందనలు



హరికృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: సచివాలయాల చీమకుర్తి పట్టణ కన్వీనర్‌గా మంచా హరికృష్ణ, రూరల్ కన్వీనర్‌గా చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డిని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నియమించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం చీమకుర్తి పట్టణ కన్వీనర్ మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం వారింటికి వెళ్లి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో చీమకుర్తి కొత్తకుమ్మరిపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చీమకుర్తి, పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది రోగులు హాజరయ్యారు. కిమ్స్ డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ జవహర్, ఆకురాతి అశ్విని, ఇజ్జగిరి రమేష్, మాడపాకుల రాజా, స్థానికులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధానికి సహకరించాలి

● మేయర్ గంగాడ సుజాత



ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: ప్లాస్టిక్ ఫ్లెక్సీల ముద్రణ, వినియోగంపై ఈ నెల 26వ తేదీ నుంచి పూర్తిగా నిషేధం అమలు చేయనున్న దృష్ట్యా ఫ్లెక్సీ ప్రింటింగ్ కేంద్రాల యజమాన్యాలు సహకరించాలని మేయర్ గంగాడ సుజాత కోరారు. స్థానిక ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. అందులో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన 65, 75 జీవోల ప్రకారం నిషేధాన్ని పూర్తిగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చదరపు అడుగుకి రూ.100 చొప్పున జరిమానా విధించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు నిషేధాన్ని మరికొంత కాలం వాయిదా వేయాలని కోరారు. ప్లాస్టిక్ బ్యానర్లకు ప్రత్యామ్నాయంగా చెబుతున్న వస్త్రంతో తయారు చేసే బ్యానర్లకు సంబంధించి అనేక ఇబ్బందులున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వస్త్రాలపై ముద్రించే బ్యానర్లు అన్ని రకాల వాతావరణాన్ని తట్టుకోలేవని, ముద్రణా సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎంహెచ్‌వో మనోహరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తి



చదలవాడ వద్ద పూర్తయిన రోడ్డు నిర్మాణం

● ప్రయాణికుల హర్షం

నాగులుప్పలపాడు: నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తి కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఒంగోలు నుంచి దిగమర్రు వరకు 216వ నంబర్ జాతీయ రహదారి నిర్మించిన విషయం విధితమే. మొదటి విడత పనుల సమయంలో చదలవాడ గ్రామంలోని చెరువు మధ్యలో నుంచి ఈ రోడ్డు వెళ్లేలా మ్యాప్ చేశారు. చెరువు మధ్యలో నుంచి రోడ్డు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తూ అప్పటి పంచాయతీ పాలకవర్గం కోర్టుకు వెళ్లడంతో ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. అప్పటి నుంచి ఇక్కడ డైవర్షన్ కోసం పోలీసుశాఖ బ్యారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన తండ్రీకూతుళ్లు ఒంగోలులో పరీక్ష రాయడానికి వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు రోడ్డు ఆగిపోయిన ప్రదేశంలో బలంగా ఢీకొనడంతో తండ్రికి తీవ్రగాయాలై కుమార్తె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మరో ఘటనలో ఇంకొల్లు నుంచి కారులో నెల్లూరు వెళ్తున్న భార్యాభర్తలు లారీ ఢీకొని తీవ్రగాయాలపాలయ్యారు. మరో ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ డ్రైవర్ గుర్తించక సింగిల్ రోడ్డులోకి రావడంతో ఢీకొని మోటారు సైకిల్ నడిపే వ్యక్తి మరణించాడు. ఇలాంటి అనేక ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డు.. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగించుకుని నిర్మాణం పూర్తిచేసుకుని విస్తరించనుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా గానాల రామమూర్తి జయంతి



నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రజని

ఒంగోలు: గానాల రామమూర్తి 131వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఉన్న బ్రహ్మంగారి గుడి వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోనుగుంట రజిని హాజరై రామమూర్తి సేవలను కొనియాడారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పత్తిపాటి బాలబ్రహ్మాచారి, రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట బ్రహ్మేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య, కార్యదర్శి నూతక్కి మల్లేశ్వరరావు, జిల్లా సంఘ మాజీ అధ్యక్షుడు పత్తిపాటి వీరాచారి, ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని చదువులో రాణించాలని ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌జాన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. హసన్ ఫాతిమా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఓక్రిడ్జ్ స్కూలులో 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అంబటి భవ్యశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, పాఠశాల కరస్పాండెంట్ శివప్రసాద్, ట్రస్ట్ కార్యదర్శి షేక్ హుమాయున్ బాషా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూమి హద్దురాళ్లను పరిశీలించిన సర్వే ఏడీ



హద్దురాళ్లు పాతుతున్న సిబ్బందితో ఏడీ గౌస్‌బాషా, డీఐవోఎస్ శ్రీనివాసరావు

మద్దిపాడు: మండలంలో రీసర్వే పూర్తయిన వెల్లంపల్లి గ్రామంలో భూములకు హద్దురాళ్లు వేస్తున్న నేపథ్యంలో సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో ప్రతి ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)కు త్వరితగతిన హద్దురాళ్లు పాతాలని గ్రామ సర్వేయర్‌కు సూచించారు. గుర్తించిన ప్రభుత్వ భూములకు కూడా హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో హద్దురాళ్లు తయారు చేస్తున్న ఫ్యాక్టరీని సందర్శించి రాయికి సంబంధించిన కొలతలు నిబంధనల ప్రకారం ఉన్నాయా.. లేదా..? అనే విషయాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఐవోఎస్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బాబూరావు ఇన్‌చార్జి సర్వేయర్ సుశీల్, వీఆర్వో అరుణ, గ్రామ సర్వేయర్లు, భూముల రైతులు ఉన్నారు.

## క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు టౌన్: 25వ అండర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేస్ కాలేజీ విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో పాల్గొన్న పేస్ విద్యార్థినులు వాలీబాల్‌లో ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో ద్వితీయ స్థానం, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో ప్రథమ, తృతీయ స్థానాలు, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. బాలుర విభాగంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, జావలిన్ త్రో, షాట్‌పుట్, కబడ్డీ, పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. బాలుర విభాగంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని విజయఢంకా మోగించారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని కోరారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు 25 వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, డాక్టర్ చైతన్య, డీన్ ఆర్. వీరాంజనేయులు, ఏవో ఎం.రమణబాబు, కో ఆర్డినేటర్ నతానియోలు, తిరుమలరావు, పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా ర్యాలీని విజయవంతం చేయండి



ఉలిచిలో రైతులతో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా నాయకులు

ఒంగోలు రూరల్: అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం, రైతు రుణ విమోచన చట్టాలు చేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2022ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ జనవరి 26న ఒంగోలులో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీ, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కిసాన్ మోర్చా నాయకులు రైతులకు పిలుపునిచ్చారు. ఆ మేరకు ఒంగోలు మండలంలోని ఉలిచి, కరవది, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం, వలేటివారిపాలెం, త్రోవగుంటలో ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుంచు శేషయ్య, చుండూరి రంగారావు, వడ్డె హనుమారెడ్డి శనివారం పర్యటించారు. కిసాన్ మోర్చా ర్యాలీలో పాల్గొనాలని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మినీ స్టేడియం వద్ద నుంచి అద్దంకి బస్టాండు మీదుగా మంగమ్మ కాలేజీ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

## నేడు విద్యుత్ అదాలత్

కొత్తపట్నం: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీ వీరాంజనేయులు తెలిపారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలున్న వారు అదాలత్‌లో పాల్గొని పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటలకు అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల సమస్యలు, లో ఓల్టేజీ సమస్యలు, లైన్లు సరిగా లేకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, వినియోగదారుడుకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.